# బీఆర్‌ఎస్‌కే ప్రజా మద్దతు

- నిత్యం జనం మధ్య ఉండే నాయకుడిని నేనే
- 60 ఏండ్లలో జరుగని అభివృద్ధి తొమ్మిదిన్నర ఏండ్లలోనే చేశాం
- మరింత అభివృద్ధికి మరోసారి అవకాశం ఇవ్వండి
- బీఆర్‌ఎస్ భువనగిరి అభ్యర్థి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి
- పగిడిపల్లిలో ఎన్నికల ప్రచారం ప్రారంభం



బీబీనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సతీమణి వనిత

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 19 : భువనగిరి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌కే ప్రజల మద్దతు ఉంటుందని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం పట్టణ పరిధిలోని 12వ వార్డు పగిడిపల్లిలో శివసీతారామాంజనేయస్వామి ఆలయంలో సతీమణి పైళ్ల వనితతో కలిసి ఆయన పూజలు నిర్వహించి ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందిందన్నారు. రెండుసార్లు భువనగిరి నియోజకవర్గం నుంచి ప్రజల ఆశీర్వాదంతో గెలుపొందానని, రానున్న ఎన్నికల్లో మరోమారు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్నానని చెప్పారు. నియోజకవర్గంలో ప్రతీ సమస్యను పరిష్కరించానన్నారు. రానున్న రోజుల్లో భువనగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. అందరి మనసుల్లో బీఆర్‌ఎస్ పార్టీపై విశ్వాసం బలంగా ఉందని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో 60 ఏండ్లలో జరుగని అభివృద్ధిని తొమ్మిదిన్నర ఏండ్లలోనే చేసి చూపించామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ ఊదరి లక్ష్మీసతీశ్‌యాదవ్, నాయకులు సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, జంగయ్యగౌడ్, ఆంజనేయులుగౌడ్, రమేశ్ పాల్గొన్నారు.

## మరోసారి ఆశీర్వదించండి

- బీబీనగర్‌లో ఎమ్మెల్యే సతీమణి ప్రచారం

బీబీనగర్, అక్టోబర్ 19 : భువనగిరి నియోజకవర్గం అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడుతున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే సతీమణి పైళ్ల వనిత కోరారు. బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలను పలుకరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గోలి ప్రణీతాపింగల్‌రెడ్డి, సర్పంచ్ మళ్ల గారి భాగ్యలక్ష్మీశ్రీనివాస్, మహిళా విభాగం మండలాధ్యక్షురాలు పిట్టల శ్యామల, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## పైళ్ల శేఖర్‌రెడ్డిని గెలిపిస్తేనే మరింత అభివృద్ధి

- ఎమ్మెల్యే కూతురు మన్వితారెడ్డి ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి కూతురు మన్వితారెడ్డి

భువనగిరి అర్బన్, అక్టోబర్ 20 : అర్బన్‌కాలనీ మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే కూతురు మన్వితారెడ్డి గురువారం పట్టణంలోని అర్బన్‌కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భువనగిరి పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. రైల్వే గేటు మార్గంలో రోడ్డు మార్గం ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు తప్పనున్నట్లు తెలిపారు. కాలనీ ప్రజల సమస్యలు తీరాలంటే మూడోసారి పైళ్ల శేఖర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కుశంగుల రాజు, కడారి వినోద్‌కుమార్, జహంగీర్, సిద్దుల పద్మ, పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న మహిళా న్యాయవాదులు

## కోర్టు ఆవరణలో బతుకమ్మ సంబురాలు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 19 : జిల్లా న్యాయశాఖల ఉద్యోగ సంఘం, భువనగిరి న్యాయవాదుల సంఘం, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో భువనగిరి కోర్టు ఆవరణలో గురువారం బతుకమ్మ సంబురాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.మారుతీదేవి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, మహిళా న్యాయవాదులు నాగేంద్రమ్మ, సంతోష, హరిప్రియ, వర్ణిక, బిందు, కోర్టు మహిళా సూపరింటెండెంట్స్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగారం అంజయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జెండగే హనుమంతు కొండిబా

## ఎన్నికల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

- కలెక్టర్ జెండగే హనుమంతు కొండిబా

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 19 : ఎన్నికల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని కలెక్టర్ జెండగే హనుమంతు కొండిబా అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ బృందాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ప్రతి విషయాన్ని నిశితంగా గమనిస్తుందని, జీపీఎస్ ద్వారా నోడల్ టీములపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. డబ్బు, మద్యం, బహుమతుల పంపిణీపై నిఘా ఉంచాలని, చెక్ పోస్టులు, జిల్లా సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సమయంలో సీ విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై స్పందించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కంట్రోల్ రూంకు ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత రిటర్నింగ్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఫిర్యాదు చేసిన 90 నిమిషాల లోపు సంబంధిత ప్రాంతానికి చేరుకొని చర్యలు తీసుకోవాలన్నారు. పట్టుబడిన నగదును సీజ్ చేసి జిల్లా కోశాధికారి కార్యాలయానికి అప్పగించాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు జి.వీరారెడ్డి, ఏ.భాస్కర్‌రావు, ఎంసీసీ నోడల్ అధికారి సునంద, జిల్లా కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి పాల్గొన్నారు.



చేనేత చిటికీలను పరిశీలిస్తున్న విదేశీ మహిళా బైక్ రైడర్స్ ప్రతినిధుల బృందం

## పోచంపల్లిని సందర్శించిన విదేశీయులు

భూదాన్‌పోచంపల్లి, అక్టోబర్ 19 : అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా, సింగపూర్, థాయిలాండ్ దేశాల మహిళా బైక్ రైడర్స్ ప్రతినిధుల బృందం గురువారం భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు. తెలంగాణ యాత్రలో భాగంగా పోచంపల్లికి చేరుకొని ఇక్కత్ వస్త్రాల తయారీని పరిశీలించారు. నేత కార్మికురాలు భారత గంగమ్మ చీర నేసే విధానాన్ని చూసి అభినందించారు. కార్యక్రమంలో పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడు గంజి యుగేందర్, ఉపాధ్యక్షుడు రుద్ర చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి అడెపు అరవింద్, సహాయ కార్యదర్శి అటిపాముల ధర్మేందర్, కార్యవర్గ సభ్యులు ఎలే శివశంకర్ పాల్గొన్నారు.

## ధాన్యం రవాణాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 19 : జిల్లాలో శుక్రవారం నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభంకానున్నందున రవాణాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టరు భాస్కర్‌రావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో లారీ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 6 బ్లాకులుగా ధాన్యం రవాణా చేయడం జరుగుతుందని, లారీలను సిద్ధంగా ఉంచాలని, కేంద్రాలకు వచ్చే ధాన్యం దృష్టిలో పెట్టుకొని సకాలంలో మిల్లులకు చేరవేసేలా చూడాలని సూచించారు. సమావేశంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ గోపికృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి

## బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించాలి

- మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి

భువనగిరి అర్బన్, అక్టోబర్ 20 : సీఎం కేసీఆర్ నూతనం రూపొందించిన బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను గడపగడపకూ వెళ్లి ప్రజలకు వివరించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 32వ వార్డులో కౌన్సిలర్ గోమారి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన గురువారం వార్డు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి గెలుపుకోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని చెప్పారు. సమావేశంలో వార్డు కౌన్సిలర్ గోమారి సుధాకర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు రాచమల్ల రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

## స్కంద మహాదేవిగా అమ్మవారు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న సిద్ధగురు రమణానందమహర్షి

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 19 : దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మండలంలోని నాగిరెడ్డిపల్లి సమీపంలోని శివశక్తి అనుగ్రహ మహాపీఠం రమణేశ్వరంలో గురువారం అమ్మవారు స్కంద మహాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సిద్ధగురు రమణానందమహర్షి మాట్లాడుతూ స్కంద మహాదేవిని ఆరాధిస్తే సకల సౌఖ్యాలు కలుగుతాయని, ఆనందంగా జీవిస్తారని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.